క్లుప్తంగా

ఉద్యోగులు ప్రజల్లో భాగమే..

భద్రాచలంటౌన్: ఉద్యోగులు తెలంగాణ అభివృద్ధికి, సంక్షేమానికి వ్యతిరేకం కాదని, ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమేననే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో ఉద్యోగులు ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే విధంగా వాఖ్యలు చేయడం తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపరిచడమే అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగులు బోనస్ ఇవ్వాలని ఉద్యమాలు చేస్తున్నారని ప్రజలను, సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా సీఎం అసత్యాలను మాట్లాడడం శోచనీయమన్నారు.

ఎమ్మెల్యే పాయం జన్మదిన వేడుకలు



మణుగూరుటౌన్: నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

సాక్షినెట్‌వర్క్: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నదానం, రక్తదానాలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పార్టీ శ్రేణుల సమక్షంలో ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు కేట్ కట్‌చేసి పంచిపెట్టారు.

సామూహిక సీమంతాలు

ములకలపల్లి: సీతానవమి పర్వదినాన్ని ములకలపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ముకుందల సత్యానారాయణ శాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్ శనగపాటి రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హనుమాన్ ఛాలీసా వినిపించారు. స్థానిక కమిటీ సభ్యులు శివకుమారి, శ్రీలత, భారీగా మహిళా భక్తులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై హర్షం

మణుగూరురూరల్: మండలంలోని సింగరేణి కార్మికులు నివాసం ఉండే పీవీకాలనీ ప్రాంతంలో యాజమాన్యం రూ.కోటి 83లక్షల వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం పట్ల ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఎంవి.రాంనర్సయ్య, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లులు మాట్లాడారు. అధ్వానంగా మారిన కాలనీ అంతర్గత రోడ్లపై యాజమాన్యం స్పందించి నిధులు చేయడంపై ఏరియా సింగరేణి జీఎం దుర్గం రామచందర్‌కు, డీజీఎం(పర్సనల్) ఎస్ రమేష్‌కు, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లుకు బ్రాంచ్ కమిటీల తరపున ధన్యవాదాలు తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

మణుగూరురూరల్: పది ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యామ్‌సుందర్‌కు మంగళవారం నాయకులు అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆర్ మధుసూదన్‌రెడ్డి, జి.శ్రీనివాస్, వి.జానయ్య, ఎస్.సాంబశివరావు, ఎస్.నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

చంద్రుగొండ: ఉపాధి కూలీలకు పనిప్రదేశం వద్ద వసతులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అనుబంధ రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. చంద్రుగొండ, గుర్రాయిగూడెం గ్రామాల్లో ఉపాధి పనిప్రదేశాలను ఆయన మంగళవారం సందర్శించారు. మండుటెండల్లో ఉపాధి కూలీలు సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా మహిళా కూలీల పరిస్థితి దయనీయంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకూలీ రూ.600లు ఇవ్వాలని, పనిదినాలు 200లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకులు టి.భీముడు, రామారావు, పాపారావు, సీతారాములు, సులోచన, రమేష్, గోపమ్మ పాల్గొన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో?

- అధ్వానంగా మామిళ్లవాయి రహదారి
- అవస్థలు పడుతున్న గిరిజనులు
- వైల్డ్‌లైఫ్ అనుమతులు లేక నిలిచిన నిర్మాణం



రాళ్లు తేలిన వెంకటాపురం-మామిళ్లవాయి రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన వెంకటాపురం గ్రామ పంచాయతీలోని మామిళ్లవాయి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వానంగా ఉండి గిరిజనులు కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడుతున్నారు. గత ఆరు ఏండ్ల క్రితం రహదారికి నిధులు మంజూరయ్యాయి. రహదారి కల నెరవేరుతుందని గిరిజనులు ఆశగా ఎదురుచూశారు. కానీ వైల్డ్‌లైఫ్ అనుమతులు లేక రహదారి పనులు అక్కడే ఆగిపోయాయి.

అటవీశాఖ అభ్యంతరం

వెంకటాపురం-మామిళ్లవాయి రహదారికి గత మూడు ఏండ్ల క్రితం 4.350 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉండగా అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రహదారి పనులు ప్రారంభం కాలేదు. రహదారి 900 మీటర్లు మినహా 3.250 కిలోమీటర్లు వెల్డ్‌లైఫ్, రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉండటంతో కేంద్రం అనుమతులు కావాల్సి ఉండటంతో అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. జీపీఎస్ సర్వే చేపట్టి కేంద్రానికి నివేదిక పంపారు. ఏడాది క్రితం కేంద్ర అటవీ పర్యావరణ వన్యప్రాణి సంరక్షణ శాఖల అధికారుల బృందం రహదారిని పరిశీలించి వెల్డ్‌లైఫ్, ఫారెస్ట్ భూమి రహదారి నిర్మాణంలో ఎంత ఉందో తెలుసుకున్నారు. రహదారి అనుమతులకు చర్యలు తీసుకుంటామని కేంద్ర బృందం స్థానికులకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు అనుమతులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

అత్యవసర సమయాల్లో ఇక్కట్లు

వెంకటాపురం నుంచి మామిళ్లవాయికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో సకాలంలో వైద్యం అందక గర్భిణులు, రోగులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు, స్థానికులదీ అదే పరిస్థితి. ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మామిళ్లవాయి గ్రామానికి రహదారి సౌకర్యం కలగడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు రహదారి అనుమతులకు తగు చర్యలు తీసుకోవాలని, రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం. మొండికుంట, అశ్వాపురం వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఎవరికైనా అత్యవసరంగా వైద్యం అందాలంటే ఆస్పత్రులకు వెళ్లాలంటే ఆలస్యం అవుతోంది. వర్షాకాలంలో ఇంకా ఇబ్బందులు పడుతున్నాం.

– బొర్రా శ్రీను, మాజీ ఎంపీటీసీ, మామిళ్లవాయి

రహదారి నిర్మించాలి..



రహదారికి నిధులు వచ్చి సంవత్సరాలు గడిచిపోతోంది. నిధులు కూడా ఉన్నాయో లేదో తెలియదు. రహదారి లేక మేము పడే బాధలు వర్ణించలేనివి. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి మా గ్రామానికి రహదారి నిర్మించేలా, అనుమతులు వచ్చేలా చేయాలి.

– తాటి సంపత్, మామిళ్లవాయి

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



బూర్గంపాడు: గొనె రామారావును సత్కరిస్తున్న అధికారులు, ప్రముఖులు

బూర్గంపాడు: కార్మిక శాఖ నుంచి ప్రతిష్ఠాత్మకమైన 'శ్రమ శక్తి అవార్డు' అందుకున్న ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గొనె రామారావును మంగళవారం సారపాకలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్ కిరణ్ ప్రసంగిస్తూ గొనె రామారావు సేవలను కొనియాడారు. ఐటీసీ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, జీఎం రాంబాబు, హెచ్‌ఆర్ రామారావు, మురళి, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, కార్యదర్శి జీఆర్‌కే రెడ్డి, బీఆర్‌టీయూ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు సింగమనేని ప్రసాద్, సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు, బీఎంఎస్ నాయకులు అశోక్ రెడ్డి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

దమ్మపేట: అర్హత కలిగిన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరుతూ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నిరసన చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని జాబితాలో అనర్హులకే పెద్ద పీట వేశారని, నిరుపేదలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పందూరి వీరబాబు, నాగమణి, ముక్తేశ్వరి, సత్యవతి, జగదీష్, నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాస్‌లైన్ నాయకులు

జీఎస్పీ ఆధ్వర్యంలో..

చర్ల: అర్హులైన వారందరికీ ఇందరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం చర్లలో పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు అర్హులను పక్కన పెట్టి అనర్హుల పేర్లను జాబితాలో చేర్చాయని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు బీరబోయిన నాగరాజు, కనితి జంపన్న, బీరబోయిన నాగయ్య, కనితి శ్రీకాంత్, గొంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు బాధితుడికి విలువైన ఇంజక్షన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో గుండెపోటు వచ్చిన ఓ వ్యక్తికి రూ.40వేల విలువ చేసే ఇంజక్షన్ వేసి వైద్యం అందించారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన 62 ఏళ్ల ఎస్‌కె.నన్నేవనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి సుమారు 11 గంటల సమయంలో ఛాతిలో నొప్పితో పాటు చెమట పట్టి, నీరసంగా ఉండటంతో కుటుంబీకులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. స్పందించిన ఏరియా ఆస్పత్రి వైద్యుడు జగదీష్.. పరీక్షల అనంతరం సదరు వ్యక్తి తీవ్రమైన గుండెపోటుతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కార్డియాలజిస్ట్ వైద్యుల సలహాలతో సదరు రోగికి రూ.40 వేల రూపాయలు విలువ గల టెనెక్టెప్లేస్ అనే ఇంజక్షన్ వేశారు.

అనంతరం మరోసారి వైద్యులు వ్యక్తికి ఈసీజీ పరీక్ష చేయగా అందులో అన్ని రిపోర్టులు సాధారణంగా వచ్చాయి. అపై అతనిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటలోగా తీసుకొస్తే.. కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు.


ఆ దేశస్తులను పంపించి వేయండి

పాకిస్తాన్, బంగ్లాదేశ్, మాయన్మార్ దేశస్తులు ఎవరైనా స్థానికంగా అక్రమంగా నివసిస్తూ ఉంటే.. వారిని గుర్తించాలని, వెంటనే వారి స్వదేశాలకు పంపించాలని బీజేపీ ఆధ్వర్యంలో పలుచోట్ల డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ మేరకు మంగళవారం నాయకులు ఆయా మండలాల్లోని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు



బూర్గంపాడు: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



చంద్రుగొండ: డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు వినతిపత్రం అందజేస్తూ..

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

పినపాక: మండల పరిధిలోని గొట్టెల పంచాయతీలో బుధవారం మంత్రి పొంగులేటి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం అందుకు సంబంధించిన ఏర్పాట్లను తహసీల్దార్ అద్దంకి నగేష్, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. పర్యటనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని, అధికారులు పర్యటనను విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో మంగళవారం ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా టీబీ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం బరువు తగ్గడం, రాత్రిళ్లు చెమటలు పట్టడం, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం వంటివి ఉన్నట్లయితే దగ్గరలోని హాస్పటల్‌కు వెళ్లి తెమడ పరీక్ష, ఎక్స్‌రే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పావనిరెడ్డి సిబ్బంది వెంకటేశ్వర్లు చిర్రా సాయికృష్ణ, టెక్నీషియన్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

అశ్వాపురం: మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కోడి నరేందర్‌కు మంగళవారం రూ.38వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద భక్తులు సందడి..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోపి పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడో రోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం స్వామి వారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు వైద్యశాల అవరణలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడే ఆటగాళ్లు తమ తోటి స్నేహితుడికి ఆర్థిక సాయం అందించారు. కాటాయిగూడెం గ్రామానికి చెందిన కొర్సా రమేష్ రోడ్డుప్రమాదానికి గురై వైద్యశాలలో చికిత్స పొందుతుండగా.. తోటి అటగాడి వైద్య ఖర్చుల నిమిత్తం షటిల్ ప్లేయర్స్ అందరూ. రూ.5300 నగదును అందజేశారు. వారిలో ప్రేమ్, వీరబాబు, ముద్దరాజు, కుర్సం రాంబాబు, శ్యామ్‌లాల్, ఎడ్ల శివ, శ్రీనివాస్, కల్లూరి శంకర్, కెల్లా పండు, గోపిచంద్, రాము ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్త



మాట్లాడుతున్న జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేందర్

మణుగూరురూరల్: విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.మహేందర్ తెలిపారు. మున్సిపాలిటిలోని చేపలమార్కెట్ ఏరియాలోని స్నేహగార్డెన్స్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ భద్రత ప్రమాణాల గురించి వివరించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. అనంతరం గత కొన్నేళ్ల క్రితం అశ్వాపురంలో జరిగిన ప్రమాదాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. వారోత్సవాల గోడపత్రికలను సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈటీ ఎస్.కృష్ణ, భద్రాచలం డీఈ జీవన్‌కుమార్, మణుగూరు ఏడీఈ, ఏఈ ఉమారావు, మణుగూరు సబ్ డివిజన్‌లోని అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ఏఈలు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు మూర్తి సాయిమోహన్, విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పేరుతో వసూళ్లు



బాధితులతో మాట్లాడుతున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు

పినపాక: మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో బొడ్రాయి పేరుతో కొందరు బలవంతపు వసూలు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన మరికొందరు ఆరోపిస్తున్నారు. బొడ్రాయి కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ రూ.6వేలు ఇవ్వాల్సిందే అంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక స్తోమత బాగాలేదు.. కొంత డబ్బు ఇస్తామని చెప్పినప్పటికీ.. ససేమిరా అంటున్నట్లు తెలిపారు. కుల బహిష్కరణ చేస్తామంటూ, పంచాయతీ నుంచి నీళ్లు రాకుండా చేస్తామని, పనులకు పిలవమని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట మార్పిడితో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగాంజలి

అశ్వారావుపేటరూరల్: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడంతోపాటు పంట మార్పిడి చేయడం ద్వారా లభాలు కలుగుతాయని శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగాంజలి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోగల రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వానాకాలం సాగుకు సమాయత్తం కావడానికి అనుగుణంగా పంటల సాగులో శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలని రైతులను కోరారు. ఆపై డాక్టర్ పి.ఝాన్సీరాణి, ఉద్యానాధికారి వేణుమాధవ్ రైతులకు పలు అంశాలను వివరించారు. రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థుల బృందం లోకేష్, లావణ్య, ప్రణీత, చాందిని, వరప్రసాద్ పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



చర్ల: సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బ్రహ్మాచారి

చర్ల: లేబర్ కోడ్‌ల రద్దు, వేతనాల పెంపు కోసం ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చర్లలో వివిధ కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మడపా సుజాత, ఉషా, సీత, సున్నం రాంబాయి, అనూష, కమల, నాగలక్ష్మి సీఐటీయూ నాయకులు చింటు తరదితరులు పాల్గొన్నారు.

12న సీపీఎం ధర్నా

దుమ్ముగూడెం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు, వెలుగులోకి వచ్చిన సమస్యల పరిష్కారానికి ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లి సత్యనారాయణ, కొడాలి లోకేష్, చంటి, మర్మం సమ్మక్క, కారం బజార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి శాపంలా వాటర్ ప్లాంట్లు

- వెయ్యి టీడీఎస్ దాటితే నీరు విషతుల్యమే
- డివిజన్‌లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్లాంట్లు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: ప్రస్తుతం ఎండాకాలంలో ప్రజలకు అత్యవసరం తాగునీరే. ఈ క్రమంలో సాధరణంగా చాలా మంది మినరల్ వాటర్‌ను తాగుతున్నారు. అవి వారి ఆరోగ్యానికి మేలు చేస్తాయని తలంచుతున్నారు. కానీ అవి అనారోగ్యం పాలు చేయవచ్చని గ్రహించలేకపోతున్నారు. ఒకరినిచూసి ఒకరు ప్రజల ఆనాలోచనతో మినరల్ వాటర్ వాడడంతో కొందరు వ్యాపారులకు కాసులను కురుస్తున్నాయి.

భద్రాచలం డివిజన్ పరిధిలో కొందరు అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ నీటి సరఫరా చేస్తున్నారు. మరికొందరైతే ఏకంగా బోరువాటర్‌నే ట్యాంకులలో నింపి రసాయనాలు కలిపి విక్రయాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తిన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం.

రసాయనాలు కలుపుతూ..

నీటి స్వచ్ఛతను కొలిచే టీడీఎస్ పరిమితి వెయ్యి వరకే ఉంటుంది. ఇది దాటితే ఆ నీరు విషతుల్యం అవుతాయి. ఆ నీరు తాగితే వారిలో మూత్రపిండాలు పాడవడం, జీర్ణవ్యవస్థ దెబ్బతినడం లాంటి ప్రమాదకర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులకు కారణం నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లే. వీరు సరఫరా చేసే నీటి నాణ్యత పరిశీలించే వ్యవస్థ ఉండకపోవడంతో చాలా మంది బోర్ నీటినే క్యాంట్లలో పట్టి వినియోగదారులకు అనుమానం రాకుండా మితిమీరిన రసాయనాలు కలుపి అందిస్తున్నారు. అవే మినరల్ వాటర్ అని నమ్మిస్తూ ఇళ్లకు పంపిణీ చేస్తున్నారు. దీంతో కిడ్నీ సంబంధిత వ్యాధుల బారీన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

తనిఖీలు ఏవి?

భద్రాచలం డివిజన్‌లో సుమారు 50 వరకు వాటర్ ప్లాంట్లు ఉంటాయి. వీటిల్లో అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. బోరు వాటర్‌లో రసాయనాలు కలుపుతున్న తతాంగం అధికారులకు తెలిసినప్పటికీ తనిఖీలు చేయడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిబంధనలు పాటించేలా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



వాటర్ క్యాన్లలో నీరు నింపుతూ..